క్లుప్తంగా

కారులో తరలిస్తున్న బెల్లం పట్టివేత



బయ్యారం: గుడుంబా తయారీకి కారులో తరలిస్తున్న బెల్లంతోపాటు పటికను గార్ల–బయ్యారం సీఐ కె.బాబురావు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మండలంలోని జగ్నాతండాకు చెందిన సుమన్ తన కారులో 1.60క్వింటాళ్ల బెల్లం, కేజీ పటికను తరలిస్తూ పట్టుబడ్డాడు. వెంటనే కారుతోపాటు సుమన్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బీజేపీలోకి జెడ్పీటీసీ సభ్యురాలు



నర్సింహులపేట: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పథకాలకు ఆకర్షితురాలినై బీజేపీలోకి వెళ్తున్నట్లు జెడ్పీటీసీ భూక్య సంగీత తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగే బీజేపీ సభలో అమిత్‌షా సమక్షంలో బీజేపీలో చేరడానికి వెళ్తూ.. మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేసి విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఒడిశా సరసకోన బీజేపీ ఎమ్మెల్యే భూదాన్ ముర్ము, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ పాల్గొన్నారు.

నేటినుంచి సదస్సులు

కురవి: నేటినుంచి సీరోలు మండలంలోని వివిధ గ్రామాల్లో వీవీ ప్యాట్, ఈవీఎంలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు సీరోలు తహసీల్దార్ దామోదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

4న ఆలయ ప్రారంభోత్సవం

తొర్రూరు రూరల్: వచ్చే నెల 4న పాలకుర్తి మండలంలోని వల్మిడి గ్రామంలో అత్యంత వైభవంగా నిర్మించిన శ్రీ రామచంద్రస్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జెడ్పీటీసీ మంగళపెల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కంఠాయపాలెం, మడిపెల్లి, వెలికట్ట, మడూరు గ్రామాల్లోకి వచ్చిన రథయాత్రకు ఘన స్వాగతం తెలిపి, ఇంటింటికి తిరుగుతూ బొట్టు పెడుతూ ఆహ్వానం పలికారు.

బోనాల వేడుకలు



మహబూబాబాద్ రూరల్ /దంతాలపల్లి/ డోర్నకల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ముత్యాలమ్మతల్లికి మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు చెల్లించుకున్నారు. రజక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత బజారులో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ కర్పూరపు పద్మ, స్థానికులు పాల్గొన్నారు.

బంచరాయితండాలో తీజ్ సంబురాలు



కురవి: మండలంలోని బంచరాయితండాలో ఆదివారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన తండావాసులు ఆటాపాటల నడుమ గంగమ్మ ఒడిలో తీజ్(బతుకమ్మలు)లను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శరత్‌నాయక్, దేవేందర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



గూడూరు: మండలంలోని సీతానగరం గ్రామానికి చెందిన సూత్రపు హరీశ్ అనే ఫొటో గ్రాఫర్ రెండు నెలల క్రితం ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సంఘం ఆధ్వర్యంలో ప్రమాద బీమా రూ.1,50,000 చెక్కును ఆదివారం మృతుడు హరీశ్ తండ్రి రవికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు నీలం రమేష్ అందించారు. కార్యక్రమంలో మండల అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్, వెంకట్, శ్రీరాం గౌడ్, లాల్‌సింగ్, వేణు పాల్గొన్నారు.

వానపడితే రాకపోకలు బంద్

- వెంకట్రాంతండా వాసుల కష్టాలు
- రోడ్డు సౌకర్యం కల్పించాలని వేడుకోలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండల పరిధిలోని ఇస్లావత్ తండా (సింగారం)గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్రాంతండా ప్రజలు తమ గ్రామ పంచాయతీకి వెళ్లాలంటే మోకాళ్లలోతు బురదమయంతో కూడుకున్న దారి గుండా అనేక అవస్థలు పడుతూ పోవాల్సిన దుస్థితి నెలకొంది. సింగారం గ్రామం నుంచి విడిపోయి కొత్తగా ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ ఏర్పడిన కూడా కష్టాలు ఇంకా ఎక్కువ అయ్యాయని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఒకవేళ అన్ని ఇబ్బందులు పడి గ్రామపంచాయతీకి ఏదో ఒక విధంగా పోదాం అనుకుంటే దారి మధ్యలో పెద్ద చెరువు అలుగు మత్తడి మార్గం ఉంది. దాని ద్వారా వెళ్దామంటే ఎప్పుడు అలుగు పోస్తుందో ఎప్పుడు రాకపోకలు బంద్ అవుతాయో అర్థం కాని అయోమయ పరిస్థితిలో ఉన్నామని స్థానికులు తెలిపారు. గర్భిణీలు, వృద్ధులు, రేషన్ బియ్యం కోసం వెళ్లే వారు, పింఛన్ల కోసం సింగారం గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అలుగు మత్తడి కోసం పైన సిమెంట్‌తో పోసిన కాంక్రీట్ మొత్తం కొట్టుకుపోయింది. ఫలితంగా టూవీలర్లు, ఫోర్ వీలర్లు, జీపీ ట్రాక్టర్ల వెళ్లే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకమార్లు కలెక్టర్, ప్రజా ప్రతినిధులకు రాతపూర్వకంగా విన్నవించుకోవడం జరిగిందని సర్పంచ్ బోడ లక్ష్మణ్ తెలిపాడు. స్పందించిన కలెక్టర్ తన నిధులను నిధులు అందుబాటులో వచ్చినప్పుడు ఇస్తా అన్నాడు. నాటి జిల్లా ట్రైనీ కలెక్టర్ అభిషేక్ అగస్త్యను స్వయంగా రిపోర్ట్ కోసం ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్రాం తండాకు పంపారు. కానీ నేటి వరకు కలెక్టర్ నిధులు నుంచి రోడ్డు మంజూరు కాలేదని, నిధులు కేటాయించి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రస్తుతం వెంకట్రాం తండా ప్రజలు గ్రామపంచాయతీకి వెళ్లాలంటే రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి.



రోడ్డును పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ అభిషేక్ అగస్త్య (ఫైల్)



బురద రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ బోడ లక్ష్మణ్, ఇరిగేషన్ ఏఈ సౌజన్య

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా ఉండాలి

గార్ల: గృహలక్ష్మి, దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యే జోక్యం లేకుండా అధికారుల సమక్షంలో పారదర్శకంగా ఎంపిక చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టిబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత జిల్లా అధికారులు గృహలక్ష్మి, దళితబంధు పథకం లబ్ధిదారులను గ్రామసభ పెట్టి గ్రామాల్లో అధికారులు సర్వే చేసి గుర్తించిన అర్హులకు మాత్రమే పథకాలు మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, మాగం లోకేష్, కె.బిక్షమయ్య, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నేడు ఎస్‌కేఎం జిల్లా సదస్సు

నెహ్రూసెంటర్: రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర అమలు చేయాలని జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఎస్కేఎం నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎస్కేఎం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమంలో అమరులైన రైతు కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ ఉద్యమ పోరాటంలో బలైన అమరవీరుల సంస్మరణ సభ వివేకానంద సెంటర్‌లో ఉంటుందని తెలిపారు. నేడు సీపీఎం కార్యాలయంలో ఎస్కేఎం జిల్లా సదస్సు ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు, కౌలుదారుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లపు సుధాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాబన్న, దేవేందర్ పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ను మార్చాలి

కురవి: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్‌ను మార్చాలని సీఐటీయూ అనుంధ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు గుగులోత్ సరోజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలన్నారు. ఒప్పందం ప్రకారం అమలు చేయాలన్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలను చేస్తామని తెలిపారు. తక్షణమే రూ.26వేల వేతనం ఇవ్వాలన్నారు.

అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి కృషి



సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

తొర్రూరు: అంబేడ్కర్ భావజాల వ్యాప్తికి అందరూ కృషి చేయాలని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య అన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం డివిజన్ కేంద్రంలో అంబేడ్కర్ భావజాలంపై మండల స్థాయి సదస్సు నిర్వహించారు. అంతకుముందు నీలి జెండాలతో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షుడు రాయిశెట్టి యాకేందర్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో శ్రీనివాస్, రామచంద్రయ్య మాట్లాడారు. దేశ గమనాన్ని మార్చడంలో అంబేడ్కర్ పోషించిన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, నాయకులు సామేలు, వెంకన్న, కృష్ణమూర్తి, నారాయణ, మహేష్, ఐలయ్య, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి

మహబూబాబాద్ రూరల్: ఎస్సీ, ఎస్టీలు ఐక్యంగా పోరాడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని టీపీసీసీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్ నాయక్, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ తిప్పర్తి శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల గుట్టయ్యగౌడ్ పిలుపునిచ్చారు. చేవెళ్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ను ఆహ్వానిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ బోడ రవినాయక్ అధ్యక్షతన ఆదివారం జిల్లా కేంద్రంలోని భవాని నగర్ తండావాసులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ విషయంలో ప్రధాన భూమిక పోషించిన ఏఐసీసీ ఆదివాసీ విభాగం వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు వెన్నమల్ల వెంకటస్వామి, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు చెన్న సీతారాములు, పట్టణ ఓబీసీ అధ్యక్షుడు లింగాల వీరభద్రం గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఐక్యతతోనే రెడ్ల సమస్యల పరిష్కారం



టార్పాలిన్లు అందుకున్న రైతులతో రెడ్డి ప్రతినిధులు

తొర్రూరు: ఐక్యతతోనే రెడ్డి సామాజికవర్గ సమస్యలు పరిష్కారమవుతాయని రెడ్డి సంక్షేమ పరివార్ సేవా సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో ఆదివారం రెడ్డి సంక్షేమ పరివార్ అర్ధ వార్షికోత్సవంలో భాగంగా పేద రైతులకు రూ.1.50లక్షలు విలువ చేసే టార్పాలిన్లు ఉచితంగా అందజేశారు. సంఘ అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. పేద రెడ్ల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌ఎస్‌పీటీ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు, వ్యవసాయ సామగ్రి, అవసరార్థులకు ఆర్థిక చేయూతనందిస్తున్నామని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి ముద్దం విక్రమ్‌రెడ్డి, కోశాధికారి కొండ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులు కందాడి అశోక్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖమ్మం సభకు తరలిన బీజేపీ శ్రేణులు



మహబూబాబాద్ అర్బన్: సభకు వెళ్తున్న నాయకులు



గార్ల: జెండా ఊపి ప్రారంభిస్తున్న విమల్‌కుమార్‌జైన్



దంతాలపల్లిలో..



కేసముద్రంనుంచి..

సాక్షి నెట్‌వర్క్: ఖమ్మంలో జరుగుతున్న కేంద్రం మంత్రి అమిత్‌షా మహాసభకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా బీజేపీ శ్రేణులు వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్ రావు, నాయకులు ఎర్రంరెడ్డి సిద్ధార్థరెడ్డి, నవీన్ కుమార్, మాజీ ఎంపీ చాడా సురేష్ రెడ్డి , శ్రీవర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలపై భారం మోపుతున్న ప్రభుత్వం

నెహ్రూసెంటర్: పేదల ఇళ్ల రెగ్యులరైజ్ పేరా 59 జీఓను అమలు చేస్తూ ప్రభుత్వం పేదలపై భారం మోపుతుందని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ వెంకన్ననాయక్ అన్నారు. సంఘ సమావేశం జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనీలో గుగులోత్ నందులాల్ అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకన్ననాయక్ మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి, గిరిజన, బహుజన ప్రజలు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, 59 జీఓ ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం వేయడం సబబుకాదన్నారు. జీఓ వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మోతీలాల్‌నాయక్, హనుమానాయక్, రాంబాబు, బాలునాయక్, రవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకన్ననాయక్

ఎమ్మెల్యేతోనే నియోజకవర్గ అభివృద్ధి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాలునాయక్

మరిపెడ రూరల్: ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌తోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని జిల్లా రైతు బంధు సమితి సభ్యులు జర్పుల కాలునాయక్ అన్నారు. మండలంలోని బాల్యతండా గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం కాలునాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బానోతు హరినాయక్, ఉపసర్పంచ్ గుగులోతు హరి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బానోతు పాప, తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓపై వెంటనే విచారణ చేపట్టాలి

మరిపెడ రూరల్/మరిపెడ: ఎంఆర్సీ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ఎంఈఓ పూల్‌సింగ్‌పై వెంటనే విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్, ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. పూల్‌చంద్ ఒక ఉపాధ్యాయ సంఘానికి కొమ్ము కాస్తు ఎంఆర్సీ నిధులు దుర్వినియోగానికి పాల్పడడంతోపాటు అక్రమ డిప్యూటేషన్లు కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఆర్సీ భవనంలో ఉపాధ్యాయులకు కనీస సదుపాయాలు కల్పించడంలో ఎంఈఓ పూర్తిగా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాడన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులను ఇష్టారాజ్యంగా మంజూరు చేశాడని ఆరోపించారు. మరికొందరు ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లకుండా, బయోమెట్రిక్ వేయకుండానే ఫోర్జరీ సంతకాలతో జీతం పొందుతున్నారని, ఈ తతంగం అంతా కూడా ఎంఈఓ కనుసైగల్లోనే జరుగుతున్నట్లు ఆరోపించారు. అతడిపై చర్య తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలి

తొర్రూరు: మండలంలోని గోపాలగిరిలో ఈ నెల 29న ఆయిల్‌పాం పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసమర్తి సీతారాములు తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డిలు హాజరుకానున్నారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఆర్‌బీఎస్ మండల కోఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి, కోఆప్షన్‌సభ్యుడు జలీల్, నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

కేసముద్రం: మండల కేంద్రంలోని పెద్దాయిచెరువు కట్టపై గంగపుత్రుల కులదైవమైన గంగమ్మ గుడి నిర్మాణానికి సర్పంచ్ బట్టు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యాల శివకుమార్ ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ తన సొంత ఖర్చులతో గుడి నిర్మాణం పూర్తిచేసి గంగపుత్రుల సంఘానికి అప్పగించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాజయ్య, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

హాస్టల్ కుక్ మృతి

డోర్నకల్: ప్రభుత్వ గిరిజన గురుకుల బాలుర వసతి గృహం కుక్ దేవరకొండ బిక్షం(59) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక ఎస్సీ బీసీ కాలనీలో నివాసం ఉంటూ హాస్టల్ కుక్‌గా విధులు నిర్వహిస్తున్న బిక్షం కొంత కాలంగా అనారోగ్యంతో ఇంటి వద్ద చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బిక్షం అంత్యక్రియల కోసం ప్రభుత్వం నుంచి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని హాస్టల్ వార్డెన్ స్వామి అందించారు.

సన్మానం



కేసముద్రం: మండలంలోని అమీనాపురం గ్రామానికి చెందిన మానుపాటి ఎల్లస్వామి, నీలమ్మ దంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్ ఇటీవల పటాన్ చెరువులోని మహేశ్వరి మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేసి పట్టాపొందాడు. ఈమేరకు అమీనాపురం గ్రామానికి వచ్చిన డాక్టర్ ఉదయ్‌కిరణ్‌ను ఆదివారం కేసముద్రం పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అంబటి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సామ సుధాకర్‌రెడ్డి, పందుల ఆనందం, జన్ను కట్టయ్య పాల్గొన్నారు.

ఒకరి అరెస్టు

కేసముద్రం: కర్రలతో దాడికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామశివారు బోడతండాకు చెందిన బోడ రమేష్ అనే వ్యక్తిపై, ఈనెల 18న బైక్ వెళ్తుండగా గాంధీపురంజీపీ సమీపాన, ఆటోలో వచ్చిన వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడగా, అట్టి కేసులో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా ఇదే కేసులో మహబూబాబాద్‌కి చెందిన బానోతు వినోద్‌ను అనే మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నివాళి

బయ్యారం: సీపీఐ సీనియర్ నాయకులు మద్దుకూరి నాగేశ్వరరావు మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి అన్నారు. ఆదివారం బయ్యారంలో మృతి చెందిన నాగేశ్వరరావు మృతదేహం వద్ద ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, సారిక శ్రీను, కళింగరెడ్డి, స్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

చిన్నగూడూరు: చేవెళ్లలో ప్రజాగర్జన సభలో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే దళిత డిక్లరేషన్ ప్రకటించడంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తూ ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాంచంద్రునాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

దరఖాస్తు

బయ్యారం: ఇల్లందు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు భీమ్లాతండాకు చెందిన ఉదయ్‌సింగ్ హైదరాబద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు.

ఆర్థికసాయం



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని పాత బజార్‌కు చెందిన టైలర్ బోయినపల్లి వెంకన్న భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.31,753 ఆర్థికసాయాన్ని వెంకన్నకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల బిందెల మల్లయ్య, ఆకుల శంబయ్య, గౌరవ అధ్యక్షుడు భువనగిరి రవీంద్ర గుప్తా, ఉపాధ్యక్షుడు దాసరి ప్రసాద్, సభ్యులు అశోక్ బాబు, శ్రీనివాస్ తప్పెట్ల వెంకన్న, రంగన్న వెంకటయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని గోపాలపురంలో కొల రవి కుమార్తె కొల మమత అనారోగ్యంతో మృతిచెందగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు డాక్టర్ భూక్య మురళీనాయక్ ఆదివారం ఆమె మృతదేహాన్ని సందర్శించి, పులమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

పాస్‌బుక్ బ్యాంక్‌లో పెట్టమనడం సరికాదు

గార్ల: రైతులు పంటరుణం తీసుకుంటే విధిగా పీఏసీఎస్ బ్యాంకులో పాస్‌బుక్ తనఖా పెట్టాలని ఆంక్షలు విధించడం బ్యాంక్ అధికారులకు తగదని ఆదివారం గార్లలో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పీఏసీఎస్ బ్యాంకులో పాస్‌బుక్ పెడితే, ఒకవేళ రైతు పాస్‌బుక్ మిస్సయితే ఎవరు బాధ్యత వహిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా పీఏసీఎస్ బ్యాంకు అధికారులు అన్ని నేషనల్ బ్యాంకుల మాదిరిగా పాస్‌బుక్ 1బీ జిరాక్స్ పెట్టుకొని రైతులకు పంటరుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

ఓటరు నమోదు కేంద్రం తనిఖీ

చిన్నగూడూరు: 18 సంవత్సరాలు పూర్తైన యువతీ, యువకులు ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మహబూబ్ అలీ అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ బూతుల వద్ద దరఖాస్తులు స్వీకరించారు.

గార్ల: మండలంలో కొత్త ఓటుహక్కు కోసం 18 సంవత్సరాలు నిండిన 27 మంది దరఖాస్తు చేసుకున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ ఆదివారం తెలిపారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలం లోని 31 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓల ద్వారా చేపట్టిన కొత్త ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు.

ఆదిదేవా వెల్ఫేర్ వార్షిక సమావేశం

కేసముద్రం: మండల కేంద్రంలోని రామమందిరంలో ఆదివారం ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ 13వ వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి మంచన శ్రీనివాస్ మాట్లాడుతూ.. సంఘంలో 439 మంది సభ్యులు ఉన్నారని, ఈ మేరకు ప్రతియేటా రైల్వే ప్రాంగణంలో గణేష్ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం విశేషమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి మురళీ, సహాయ కార్యదర్శులు వీరునాయక్, హరీష్‌నాయక్ పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి



తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతి, యువకులు చెడు మార్గాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సీఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని మడిపెల్లి గ్రామంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ.. యువకులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు ప్రదార్థాలు, సైబర్ నేరాలు, దొంగతనాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై జగదీష్, సర్పంచ్ వెల్పుల బిక్షపతి, ఉపసర్పంచ్ రామలింగం, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.